వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

అక్కాపూర్‌లో ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

మాచారెడ్డి, నవంబర్ 30 : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న వెనుబడిన (సీ గ్రేడ్) విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు యేసురత్నం మాట్లాడారు. ప్రతి ఒక్క విద్యార్థి ఏ గ్రేడ్‌లోకి మార్చడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పగడాల బాల్‌చంద్రం, గడ్డం బాబు, రమేశ్, వెంకట్ రెడ్డి, దేవాచారి, శ్రీను, లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6 నుంచి బాల వైజ్ఞానిక ప్రదర్శనలు

కామారెడ్డి, నవంబర్ 30 : ఈ నెల 6, 7వ తేదీల్లో 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, 12వ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శన ఉంటుందని డీఈవో రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన బాన్సువాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట్, నవంబర్ 30 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారిణి శ్రీవాణి శనివారం ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు పద్ధతిలో ఇంగ్లిష్ గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 2వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కస్తూర్బా గాంధీ పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ, టెట్ క్వాలీఫై ఉండి కామారెడ్డి జిల్లాకు చెందిన వారు అర్హులని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కామారెడ్డి, నవంబర్ 30 : పట్టణంలోని గాంధీ గంజ్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్ లో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియన వ్యక్తిని ఓ బలమైన ఆయుధంతో తల, ఇతర శరీర భాగాలపై కొట్టి హత్య చేసినట్లు మార్కెట్ కమిటీ క్యాదర్శి నర్సింహులు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాడు. మృతి చెందిన వ్యక్తి సాయియేసు, 30 నుం చి 40 ఏండ్లు ఉంటాయన్నారు. శుక్రవారం రాత్రి రోజు మాదిరిగా అక్కడ నిద్రించే ప్రాంతంలో పక్కన ఉన్న వేరే రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలతో గొడవ జరిగింది. వారు అతడిని ఓ ఆయుధంతో కొట్టి హత్య చేశారన్నారు. మృతుడి కుడిచేతిపై ఇంగ్లిష్‌లో స్రావ్య అని, ఎడవ చేతిపై త్రిశూలం, ఢమరుకం, ఓం పచ్చబొట్టు ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

వసతి గృహాల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 30 : పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని మండల విద్యాధికారులు, వసతి గృహాల సంక్షేమ అధికారులకు ఆహార భద్రతపై ఒరియంటేషన్, శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రం లో పలు ప్రాంతాల్లో వస్తున్న వార్తలపై జిల్లాలోని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజన్ కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బియ్యంలో పురుగులు, తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఫుడ్ ఇన్‌చార్జిలకు వంటలు వండే వారికి అవసరమైన శిక్షణ, సూచనలు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ సీఈవో, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి చందర్ నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిణి రజిత, డీఈవో రాజు, మండల విద్యాధికారులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలనవిజయోత్సవాలు నిర్వహించాలి..

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను నేటి నుంచి 9వ తేదీ వరకు నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. శాఖల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరంగా కార్యక్రమాలను నిర్వహించాని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, విక్టర్, జిల్లా అటవీశాఖ అధికారిణి నిఖిత, జడ్పీ సీఈవో చందర్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జోడు దివ్వెలు కావ్యావిష్కరణ

జోడు దివ్వెలు కావ్యావిష్కరణ చేస్తున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయ విశ్రాంత ఆచార్యుడు రఘునాథ శర్మ

కామారెడ్డి, నవంబర్ 30 : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న గణపతి క్షేత్రంలో ఓరియంటల్ కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మేడవరం అనంత కుమారశర్మ తన తండ్రి మేడవరం సత్యనారాయణ శాస్త్రీ అనువదించిన కావ్యాలు భారవి, నీతి హేతి, మాఘ సౌరభం రాజనీతి సంబంధించిన నైతిక విలువలతో కూడిన రెండు గ్రంథాలను శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయ విశ్రాంత ఆచార్యుడు రఘునాథ శర్మ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సత్యనారాయణ శాస్త్రీ సమాజానికి హితవు కలిగించే సూక్తులను ఆంధ్రీకరించారని, దానికి ఆయన కుమారుడు మేడవరం అనంతకుమార్ శర్మ భావ వివరణ చేశారని అన్నారు. ఎంతో మంది తెలంగాణ మేధావులు ఆంధ్ర ప్రాంతానికి, ఆంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణకు వలస వచ్చి తెలుగు భాషను సుసంపన్నం చేశారన్నారు. ఇతిహాస వేదాలు సమాజాన్ని సరైన దారిలో నడపడానికి ఈ ఆవిష్కరణలు పుట్టాయని అన్నారు. కార్యక్రమంలో కావ్యాష్కరణ కర్త డాక్టర్ మేడవరం అనంతకుమార్ శర్మ, కావులు డాక్టర్ గణపతి అశోక శర్మ, చిత్కళ శ్రీనివాస శర్మ, డాక్టర్ బోచర్కర్ ఓంప్రకాశ్, సుమిత్రానంద్, డాక్టర్ కాచాపురం దుర్గాదేవి, డాక్టర్ మేకల రామస్వామి, పండితులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలపై సీఎం నిర్లక్ష్యం

పాఠశాలలు బంద్ చేయించి నిరసన తెలియజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, నవంబర్ 30 : రాష్ట్రంలో ఇటీవల ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌కు నిరసనగా శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడు తూ.. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్యూ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో ప్రభు త్వ పాఠశాలలను బంద్ చేయించామన్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం తగదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో కల్తీ ఆహారం, ఫుడ్ పాయిజన్ ఘటనలు, పాము కాటుతో విద్యార్థుల మరణాలు, మధ్యాహ్న భోజనం పథకంలో కారం మెతుకులుతో చాలీచాలని భోజనాలతో ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తూతూ మంత్రంగా పర్యవేక్షణలు చేయడం, విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. పేద మధ్య తరగతి విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరి వీడాలని సూచించారు. విద్యారంగాన్ని పట్టించుకోకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు శివ, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, నాయకులు మణికంఠ, కృష్ణ, సతీశ్, శ్రీరామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

పాఠశాల ఆవరణలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నస్రుల్లాబాద్, నవంబర్ 30 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బీర్కూర్ జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శివరాం అన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో శనివారం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు, పర్యావరణ పరిరక్షణకు అనుసరించాల్సిన సూచనలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మెంటర్ ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెమిస్టర్ తరగతులు ప్రారంభం

కామారెడ్డి, నవంబర్ 30 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభు త్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మొదటి సంవత్సరం 2024-25 బ్యాచ్, రెండో సంవత్సరం 2023-24 విద్యార్థులకు నేటి నుంచి 8వ తేదీ వరకు సెమిస్టర్ 1, 3 లాంగ్వేజ్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు కోఆర్డినేటర్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

పోతంగల్, నవంబర్ 30 : రెండు బైకులు ఎదురుగా ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కల్లూర్ వద్ద శనివారం చోటు చేసుకున్నది. బిచ్కుంద మండలం వాజీద్ నగర్‌కు చెందిన ఎం.సాయిలు (48) హున్సా నుంచి వాజీద్ నగర్‌కు బైక్‌పై బయల్దేరాడు. బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన సాయిలు పోతంగల్ వైపు ద్విచక్ర వాహనం పై వస్తుండగా మార్గమధ్యంలో కల్లూర్ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాజీద్‌నగర్‌కు చెందిన సాయిలు మృతి చెందగా, బరంగెడ్గి కి చెందిన సాయిలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సింహ గర్జన సభకు తరలిరావాలి

నస్రుల్లాబాద, నవంబర్ 30 : హైదరాబాద్‌లో నేడు నిర్వహించనున్న మాలల సింహ గర్జన సభకు తరలిరావాలని నస్రుల్లాబాద్ మండలం దళిత సంఘాల నాయకులు కోరారు. మండలం పరిధిలోని పలు గ్రామాల దళిత సంఘాల నాయకులు సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు. మాల సంఘం అధ్యక్షుడు బాల సాయిలు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి పోశెట్టి, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రావణ్, సాయిలు, నర్సింహులు, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం సందర్శన

బాన్సువాడ టౌన్, నవంబర్ 30 : బాన్సువాడ ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ విద్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను విద్య, ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దయానంద్, కంటి వైద్యుడు ముజామిల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాబోధనకు దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట, నవంబర్ 30: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలుగు, గణితం బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ఎస్వో వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తిచేసిన వారు డిసెంబర్ 2వ తేదీలోగా తమ దరఖాస్తులను స్థానిక పాఠశాలలో సమర్పించాలని ఆమె సూచించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం..

బిచ్కుంద, నవంబర్ 30 : మండల కేంద్రంలోని కేజీబీవీ కాలేజీలో మూడు అతిథి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎస్వో రాగిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీసీఆర్టీ ఇంగ్లిష్, పీజీసీఆర్టీ సివిక్స్, పీజీసీఆర్టీ నర్సింగ్ సబ్జెక్టులు బోధించడానికి పీజీ, బీఈడీ ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు డిసెంబర్ 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, కేజీబీవీ కాలేజీలో కలవాలని లేదా 9182108237 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

అయ్యప్ప స్వామిని పంచామృతాలతో అభిషేకిస్తున్న ఎమ్మెల్యే, గురు స్వాములు

నాగిరెడ్డిపేట, నవంబర్ 30: నాగిరెడ్డిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప మహా పడి పూజ కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పడిపూజలో పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య చంద్రం గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పంచామృతాలతో అయ్యప్ప స్వామిని అభిషేకించారు. అర్ధరాత్రి వరకు జరిగిన పడిపూజలో..నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన మాలధారుల అయ్యప్ప నామస్మరణతో గ్రామం మార్మోగింది. పడిపూజకు విచ్చేసిన ప్రజాప్రతినిధులు, గ్రామస్థులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా చందాలు వేసి మహా పడి పూజ నిర్వహించినట్లు మాలధారులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★డీవీపల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605

BUSINESS OFFER

★బియ్యం, ధాన్యం, పప్పు టన్నులు టన్నులు కొంటాం. మాది అతి పెద్ద రైస్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్. ధాన్యం, రైస్ వ్యాపారస్తులు & ఆల్ ఫుడ్ ఐటమ్స్ అమ్మేవారు, రైస్ మిల్లర్లు, మీడియేటర్స్, ఈ బిజినెస్‌లో పెట్టుబడి పెట్టే పార్టనర్స్ డైరెక్ట్: 8008251356.
NT-339341

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన దీక్ష

ఎల్లారెడ్డి విద్యా వనరుల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగ సంఘ సభ్యులు

కామారెడ్డి/లింగంపేట/మద్నూర్/నిజాంసాగర్/ఎల్లారెడ్డి రూరల్/బిచ్కుంద/ నస్రుల్లాబాద్, నవంబర్ 30 : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఎంఆర్సీ కేంద్రాల ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 3వ తేదీలోగా ఉద్యోగుల పేస్కేల్, క్రమబద్ధీకరణ వంటి సమస్యలను నెరవేర్చాలన్నారు. లేకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు శైలజ, మాధవి, కాళీదాస్, సారిక, భక్తమాల, మానస, కృష్ణంరాజు, గోపాల్, శంకర్, గణేశ్, చిరంజీవి, రాములు, కవిత తదితరులు పాల్గొన్నారు. సర్వశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ అధ్యక్షుడు రవీంద్ర శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లింగంపేట మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద ఉద్యోగులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యూలర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, పీఆర్టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, అసోసియేట్ సభ్యుడు సుధాకర్‌రావు, పాణి కుమార్‌రాజ్, తపస్ మండల శాఖ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. మద్నూర్ మండలకేంద్రంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామని ఎస్ఎస్ఏ మండల అధ్యక్షుడు రవికాంత్ తెలిపారు. నిరసనకు పీఆర్టీయూ, తపస్ నాయకులు సునీల్, శివరాం, భీమ్, మారుతి, శ్రీనివాస్, శివకాంత్, అజిత్, సంజయ్, సత్యం తదితరులు సంఘీభావం తెలిపారు. నిజాంసాగర్ విద్యావనరుల కేంద్రం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉమ్మడి నిజాంసాగర్ మండల పీఆర్టీయూ శాఖలు మధ్యాహ్న భోజన సమయంలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్‌నగర్ అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాంరెడ్డి, నిజాంసాగర్ ప్రధాన కార్యదర్శి సురేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రమణ, భాస్కర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్, మండల సహాధ్యక్షుడు అజయ్, కార్యదర్శి ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని విద్యావనరుల కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. మండలశాఖ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టీఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘ సభ్యులు సీఆర్పీలు మహిపాల్, దత్తు, మహేశ్, విజయలక్ష్మి, పీటీఐలు రత్నయ్య, పవన్, వనజ, అరుణ, సుజాత, ఎంఆర్‌సీ స్టాఫ్ కాశీరాం, లక్ష్మణ్, ఐఈఆర్‌పీ వెంకటేశం తదితరులున్నారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల శ్రమ దోపిడీని అరికట్టాలని ఎస్టీటీ యూనియన్ అధ్యక్షుడు ఖయ్యూం అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించిన సమగ్ర శిక్షా అభియాన్ ఉ ద్యోగుల నిరసన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడా రు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మారుతి, ప్రమోద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.తక్షణమే సర్వశిక్షా ఉద్యోగుల సమస్య లు, డిమాండ్లను పరిష్కరించాలని సర్వశిక్షా మండల అధ్యక్షుడు హన్మాండ్లు డిమాండ్ చేశారు. నస్రుల్లాబాద్ మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సర్వశిక్షా ఉద్యోగులు నిరసన చేపట్టారు. వారికి పీఆర్టీయూ మండల సభ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీచంద్, రాష్ట్ర బాధ్యులు హన్మాండ్లు, పండరి గౌడ్, కిషన్ లాల్, గోపాల్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

రామారెడ్డి, నవంబర్ 30 : అన్నంలో పురుగులు వస్తున్నాయనే సమాచారంతో శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల భోజనశాలను మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకులు పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే భోజనం నాణ్యతగా ఉండాలని, లేని పక్షంలో అధికారులు, ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరిగ్గా అందించడంలేదని, ఎక్కడ చూసినా సమస్యలు కనిపిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్, మండల మాజీ సెక్రెటరీ మైపాల్ బల్దేవ్, అంజయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'సీసీ రోడ్డు వేయించండి'

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 30: చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలిగే మౌలాన్‌ఖేడ్ గ్రామానికి వెళ్లే రహదారిని సీసీ రోడ్డుగా మార్చాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘ సభ్యులు, గ్రామ యువకులు కలిసి శుక్రవారం రాత్రి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సీసీ రోడ్డును వేయిస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కుసులకంటి సాయిలు, చంద్రశేఖర్‌రావు, శ్రీశైలం, రమేశ్, శ్రీనివాస్, లక్ష్మణ్, సిద్ధు, అశోక్, రాజు తదితరులున్నారు.

విద్యుత్ సమస్య తొలగింపు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 30: కొన్నేళ్లుగా వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ శనివారం తొలగించారు. పట్టణంలోని 12వ వార్డులోని హౌసింగ్ బోర్డు, గూడెం, నీలకంఠేశ్వర కాలనీకి చెందిన ప్రజలు కొన్నేండ్లుగా లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. వార్డు కౌన్సిలర్ జంగం నీలకంఠంఅప్ప సమస్యను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడారు. అక్కడ నియంత్రిక ఏర్పాటుచేస్తే లో వోల్టేజీ సమ స్య తీరుతుందని వారు తెలిపారు. సమస్య ను పరిష్కరించడానికి కాలనీలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించడానికి కావలసిన విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసే పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనులు ప్రారంభం కావడంతో వార్డు ప్రజలు మున్సిపల్ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆయనవెంట నాయకులు విద్యాసాగర్, వసీం తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరం

గాంధారి, నవంబర్ 30: మండలంలోని సీతాయిపల్లి గ్రామంలో శనివారం పశుగణన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువైద్యులు మజీద్ హైమద్, రవి పశువులను పరీక్షించారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

గాంధారి, నవంబర్ 30: గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని, అందులోని పుస్తకాలను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న పాత గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. అద్దె భవనంలో గ్రంథాలయం నిర్వహిస్తుండడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులు వసతులు లేక చదువుకోలేక పోతున్నారని స్థానిక నాయకులు